నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

'ఆదర్శ'లో ప్రవేశాలకు మరో అవకాశం

- దరఖాస్తుకు 11వ తేదీ వరకు అనుమతి

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల కేంద్రంలోని అచ్చంపేట్ ఆదర్శ పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి లో ఎంట్రన్స్ తో పాటు ఏడు నుంచి పదో తరగతి లో ప్రవేశాలకు పరిమిత కాలి సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 2వ తేదీ చివరి కావడంతో దానిని మార్చి 11 వ తేదీ వరకు గడువును పొడిగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిజాంసాగర్ మండల విద్యార్థులకు ఆమె సూచించారు.

పోచారం ప్రాజెక్టు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టును ఆదివారం గోదావరి నది మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ముఖేష్ కుమార్ సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డి ఈ ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోదావరి నది మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు ముఖేష్ కుమార్ సింహ ఆదివారం రోజు ప్రాజెక్టును పరిశీలించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న నదులు ప్రాజెక్టులను గోదావరి నది మేనేజ్మెంట్ అప్పుడప్పుడు పరిశీలిస్తుందని అందులో భాగంగానే ప్రాజెక్టును పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.


పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్యేకాధికారులున్నా.. పనులు కావట్లే

- నిధులు లేక గ్రామాల్లో నిలుస్తున్న పనులు
- అప్పులు చేసి నెట్టుకొస్తున్నట్టు కార్యదర్శులు
- డిజిటల్ 'కీ' రాక విడుదల కాని నిధులు

నవతెలంగాణ-భిక్కనూర్



గ్రామపంచాయతీల్లో రోజువారీ నిర్వహించే పనులకు నిధుల సమస్య తలెత్తింది. గ్రామంలో మంచినీరు, విద్యుత్ దీపాలు, ట్రాక్టర్ ద్వారా చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డ్‌లో వేయడం, నీటి సమస్య ఏర్పడితే పరిష్కరించడం వంటి గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు నిధులు లేక నిలిచిపోతున్నాయి. పనులు చేపట్టేందకు జీపీ కార్యదర్శుల వద్ద డబ్బులు లేక సతమతమవుతున్నారు. గతంలో సర్పంచ్‌లు ఉన్న సమయంలో అలాంటి పనులకు డబ్బులు వెచ్చించి నిధులు రాగానే తీసుకునేవారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండా పోయింది. ప్రత్యేకాధికారులు నామమాత్రం కావడంతో జీపీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల అప్పులు తెచ్చి పనులు చేపడుతున్నట్టు కార్యదర్శులు వాపోతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 526 గ్రామపంచాయ తీలున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. జీపీ సెక్రెటరీలు, ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ ఇచ్చారు. గ్రామపంచాయతీకి 15 ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్, జనరల్ ఫండ్ ఈ మూడు నిధుల ద్వారా నిధులు వస్తాయి. 15 ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ జనాభా ప్రాతిపదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీ అకౌంట్లో నిధులు జమ చేస్తాయి. గ్రామంలో వసూలైన పన్నులు, ఇతర నిధుల ద్వారా వచ్చే ఆదాయాలు జనరల్ ఫండ్ లో జమ చేసి పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లిస్తారు. గ్రామ పాలనకు 15 ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ నుండి వచ్చే నిధుల ద్వారా గ్రామ సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. 15 ఫైనాన్స్ నిధులు సర్పంచులు పదవీకాలం ముగిసె సమయంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు తీసుకోగా, గత సంవత్సర కాలం నుండి రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్‌లో నిధులు జమ చేయలేదు. ప్రస్తుతం పంచాయతీలో స్టేట్ ఫైనాన్స్, 15 ఫైనాన్స్ లలో నిధులు లేక, ఇటు ఇంటి పన్నులు, ఇతర ఆదాయం నుండి వచ్చే ఆదాయాలు జనరల్ ఫండ్ లో సమకూరక పంచాయతీ నిర్వహణ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులకు భారంగా మారింది.

స్పెషల్ ఆఫీసర్లు నియమించిన వారు వారి విధులు నిర్వహించుకోవడంతోనే సరిపోతుంది. ఉన్న పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీలో నిధులు లేక తమ సొంత జీతాలతో ఖర్చు చేస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. గ్రామంలోని నీటి సమస్య, మొక్కలకు నీళు పోసే వాటర్ మెన్ జీతాలు, విద్యుత్ సమస్య, ట్రాక్టర్ డీజిల్ ఖర్చులు ఇలా చాలావరకు పంచాయతీ కార్యదర్శులు చెల్లించి పంచాయతీ పాలన నిర్వహిస్తున్నారు. దీంతో కార్యదర్శుల కుటుంబ ఖర్చులు భారమై అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఓ పంచాయతీ కార్యదర్శి పంచాయతీలో ఖర్చు చేసిన నిధులు రాకపోవడంతో సొంత జీతాలతో పంచాయతీ సమస్యలు పరిష్కరించి కుటుంబ ఖర్చులకోసం బంగారం తాకట్టు పెట్టుకున్నట్టు తెలిపారు.

సర్పంచుల పదవీకాలం ముగియకముందే డిజిటల్ కీల సమస్య పరిష్కరించాల్సిన అధికారులు కాలయాపన కారణంగా నిధులు రాక కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. ఏది ఏమైనప్పటికీ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనైనా స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల చేసి పంచాయతీ సమస్యలు పరిష్కరించడంలో నిధుల కొరత లేకుండా చేసి అప్పులు చేసి మరీ గ్రామ సమస్యలు పరిష్కరిస్తున్న కార్యదర్శులకు నిధుల కొరత లేకుండా చూడాలని కార్యదర్శులు కోరుచున్నారు.



పెండింగ్‌లో డిజిటల్ 'కీ'

సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత బిల్లుల మంజూరు కొరకు స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శుల డిజిటల్ కి ద్వారా నిధులు విడుదల చేసుకోవాల్సి వస్తుంది. ప్రస్తుతం డిజిటల్ కీలు పెండింగ్లో ఉన్న కారణంగా నిధులు రాక పంచాయతీ పాలన ఏ విధంగా కొనసాగించాలో తెలియక కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించకుంటే అధికారుల ఒత్తిడి, డబ్బులు లేని కారణంగా ఏ విధంగా పనులు చేయాలో తెలియక అప్పులు చేసి మరి సమస్యలు పరిష్కరిస్తున్నారు.

సౌకర్యాలు కల్పించకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారా..?

- అంగన్‌వాడీ సెంటర్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటనను ఖండించిన సీఐటీయూ
- ఉన్న సమస్యలను ముందు పరిష్కరించండి : సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

'అంగన్‌వాడీ సెంటర్‌లలో కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. అద్దె బకాయిలు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించ కుండా.. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని ఖండిస్తున్నట్టు' సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివా రం కామారెడ్డిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడా రు. 'రాష్ట్రంలో 70 వేల అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. మూడేళ్ళ నుంచి బిల్స్ లేవు. కనీసం పిల్లలకు పెట్టడానికి బియ్యము, గుడ్లు, నూనెలు ఇవన్నీ పిల్లలకు పౌష్టిక ఆహారం పెడదా మంటే అంగన్‌వా డీల్లో కనీస సౌకర్యాలు లేవు. అయినా సెంటర్లో సీసీ కెమెరా పెడతానని సీఎం రేవంత్ చెప్పడం సరైనది కాదు. టీచర్లకు ఈవెంట్స్ బిల్స్, ఏళ్ల తరబడి కూరగాయ బిల్లులు, అంగన్‌వాడీ సెంటర్ల అద్దె బిల్లు లు, ఆయాలకు ఏళ్ల తరబడి బిల్స్ రాకపోవడం 30, 40 ఏళ్ల నుంచి చేస్తున్న వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోతున్నారు. కనీస వేతనాలు అమలు చేయలేకపో తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అంగన్వాడీ ఆయాల సమస్యలు అనేకం ఉన్నాయి. అంగన్ వాడీల పై అధికారులైన సీడీపీవోలను, సూపర్‌వైజర్‌లను రక్షించడానికి ఇలాంటి పనులు చేయడం సిగ్గుచేటని, అవినీతి అధికారులైన వారిపై ముందుగా చర్యలు తీసుకోవాలని' డిమాండ్ చేశారు. రోగానికి మందు వేయరు కానీ ప్రాణాలు తీయడానికి ఉరితాడు పెడుతున్నారని దుయ్యబట్టారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

టీచర్లు, ఆయాలు కేంద్రంలో పని చేయకుండా అదనపు పనులు చెప్తూ పిల్లలకు చదువు చెప్పకుండా అధిక పని భారం మోపుతున్నారని, నెత్తి మీద అనేక రిజిస్ట్రేషన్‌లో యాప్ లో భారం వేస్తున్నారని తెలిపారు. ఇలా అనేకమైన సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయకుండా సీసీ కెమెరాలు పెడతామనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకుంటే ఈ ప్రభుత్వం పైన అంగన్ వాడి టీచర్ ఆయాల ఈ పోరాటం ఉధృతం అవుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

అబార్షన్ కిట్లు విక్రయించిన మెడికల్‌కు నోటీసులు

నవతెలంగాణ-రామారెడ్డి

అబార్షన్ కిట్లు, అన్ వాంటెడ్ కిట్లు, నిషేధిత ఔషధ మాత్రలు విక్రయించారని మండలంలోని రెడ్డి పేటలో బాలాజీ, లక్ష్మీ నరసింహ మెడికల్ షాపులకు గత మంగళవారం డ్రగ్స్ ఇన్స్పెక్టర్ రాజిరెడ్డి మెడికల్ షాపులు తనిఖీ చేసి నోటీసులు జారీ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రజల ప్రాణాలతో, చట్ట వ్యతిరేక ఔషధాలను విక్రయిస్తున్నా, చర్యలు తీసుకోవలసిన అధికారులు, సమాజానికి, మీడియాకు తెలియకుండానే గుట్టు చప్పుడు కాకుండా నోటీసులు ఇవ్వడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్గతంగా ఏమి జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం..?

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ మారుతున్నాయి. తాజాగా ఎన్‌డీసీసీబీ (నిజామాబాద్ డిస్టిక్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్) చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పై అవిశ్వాసం పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. 15 మంది డైరెక్టర్‌లు పార్టీ మారే అవిశ్వాసం నోటీసు ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంట్లో భాగంగానే పలువురు డైరెక్టర్‌లు బీఆర్ఎస్ కార్యక్రమాలకు అంటిముట్టనట్టుగా ఉంటున్నట్టు సమాచారం. గతంలో 20 మంది డైరెక్టర్‌లు బీఆర్ఎస్ పార్టీ వారే కావడంతో అప్పట్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి.. డీసీసీబీ చైర్మన్‌గా భాస్కర్‌రెడ్డిని నియమించారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో గతంలో నుండి ఆయన పై అసంతృప్తి ఉన్న నేతలుపార్టీ మారి కాంగ్రెస్ కండువా కప్పుకుని అవిశ్వాసం పెట్టి చైర్మన్ పదవి చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. వీరిలో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ప్రధాన అనుచరులున్నట్టు సమాచారం. ఒక వైపు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధం చేయడం చర్చనీయాంశం అవుతుంది.

అర్ధరాత్రి వరకు వ్యాపారాలకు అనుమతి

- పోలీస్‌శాఖ ప్రకటనపై సర్వత్రా చర్చనీయాంశం
- రాజకీయ ఒత్తిళ్లు అంటూ అనుమానం..?

నవతెలంగాణ-కంఠేశ్వర్

అర్ధరాత్రి వరకు వ్యాపారాలు జరుగుతుండటంతో అసాంఘీక కార్యకలాపాలు పెరిగి నేరాల సంఖ్య పెరుతుండటంతో వాటిని నిరోధించేందుకు సీపీ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం అర్ధరాత్రి వ్యాపారాలపై ఉక్కుపాదం మోపింది. రాత్రి 10 నుంచి 10.30 గంటల వరకు వ్యాపార సముదాయాలు మూసివేయించారు. అతిక్రమించిన ఓ వ్యాపారిపై కేసు నమోదు చేయగా.. కోర్టు రెండు రోజుల జైలు శిక్ష సైతం విధించిన విషయం విధితమే. అయితే నిక్కచ్చిగా వ్యవహరించి నిబంధనల ప్రకారం పోలీస్‌శాఖ విధులు నిర్వర్తిస్తుంటే.. వారిపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా ఏప్రిల్ చివరి వారం వరకు వ్యాపార వేళలను అర్ధరాత్రి 12 గంటల వరకు నిర్వహించుకోచ్చని పోలీస్‌శాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మహా శివరాత్రి , గుడ్ ఫ్రైడే , రంజాన్, ఉగాది, శ్రీ రామనవమి, హనుమాన్ జయంతి మొదలగు పండుగలను పురస్కరించుకొని ప్రజల సౌలభ్యం కోరకు ఏప్రిల్ నెల చివరి వరకు కమిషనరేట్ పరిధిలోని గల వ్యాపార సముదాయాలకు రాత్రి 10:30 నుండి రాత్రి 12 గంటల వరకు మినహాయింపు ఇస్తున్నట్టు పేర్కొనడం గమనార్హం.

పోలీస్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడటంపై సర్వత్రా చర్చనీయాంశం అయింది. గత 15 రోజులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి వ్యాపారాలపై నిక్కచ్చిగా వ్యవహరించారు. అయితే సడన్‌గా పోలీస్ శాఖ ద్వారా ఇలాంటి ఆదేశాలు జారీ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు సోషల్ మీడియాతో స్థానికంగా చర్చనీయాంశం అయింది. ఇటీవల కాలంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 10 గంటలకు అన్ని సముదాయాలును మూసి ఉంచాలని నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆదివారం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందని అలాగే ఇతర ప్రజాప్రతినిధుల నాయకుల ఒత్తిడి ఉన్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోలియో మహమ్మారిని తరుముదాం

- ఐదేండ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించాలి : కలెక్టర్ సూచన
- నేడు, రేపు సైతం పల్స్‌పోలియో

నవతెలంగాణ-విలేకరులబృందం

ఐదేండ్ల లోపు పిల్లందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించి దేశం, ప్రపంచం నుంచి పోలియో మహమ్మారిని తరుముదాం అని అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు సంఘాల ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ, ఆస్పత్రులు, బస్టాండ్, రైల్వే స్టేషన్, పలు ప్రధాన సెంటర్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కామారెడ్డి : కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ , స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిల ఆధ్వర్యంలో పోలియో చుక్కల వితరణ కార్యక్రమం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,02,555 మంది ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నారని ఆదివారం ఒక్క రోజే 98,468 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. సోమ, మంగళవారాల్లో సైతం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పొలబోయిన సత్యం, క్లబ్ కార్యదర్శి, పి. రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్, సభ్యులు ధనుంజయ, డాక్టర్ బాలరాజ్, డాక్టర్ విజయకుమార్, గడ్డం గంగారెడ్డి, మర్కంటి కృష్ణమూర్తి, వెంకటరమణ పనస అంజయ్య, వై.శంకర్ పాల్గొన్నారు.


కామారెడ్డిలో చుక్కలు వేస్తున్న కలెక్టర్

స్వీయ ఆత్మరక్షణపై శిక్షణకు రికార్డు

- ఏకకాలంలో 11 వేల మందికి శిక్షణ
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో నమోదు
- జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ-కంఠేశ్వర్


స్వీయ ఆత్మరక్షణపై శిక్షణకు హాజరైన వేలాది మంది విద్యార్థినులు, యువతులు, మహిళలు

తెలంగాణ రాష్ట్ర, నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు వివిధ శాఖలలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు వేలాదిగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం రికార్డు సృష్టించింది. ఏక కాలంలో 11 వేల మంది వరకు శిక్షణలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు దక్కించుకున్నారు. విజయవంతంగా కొనసాగిన ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు, శిక్షణ తరగతులు ముగిసిన మీదట అవార్డును ప్రకటిస్తూ జిల్లా జడ్జి సునీతా కుంచాలకు మెడల్ బహూకరించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు నమోదు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖల తోడ్పాటుతో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలకు చెందిన హైస్కూల్ బాలికలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు న్యాయ, అటవీ, వైద్యారోగ్య, పోలీస్ తదితర శాఖలలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు సైతం పాల్గొన్నారు.

దీంతో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేలాదిమందితో కిక్కిరిసిపోయింది. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, జిల్లా జడ్జి సునీతా కుంచాల, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు హాజరయ్యారు. ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు జరిగిన శిక్షణ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగింది. తైక్వాండో కోచ్ మనోజ్ పర్యవేక్షణలో విద్యార్థినులు, యువతులు ఎంతో అలవోకగా స్వీయ రక్షణ టెక్నిక్ లను ప్రదర్శిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, నేటి సామాజిక పరిస్థితుల్లో బాలికలు, మహిళలందరూ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉద్బోధించారు. శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలుగుతారని సూచించారు. ఇండియా లెవెల్ లోనే కాకుండా ఆసియా స్థాయిలో రికార్డు నెలకొల్పేలా బాలికలు, మహిళలు వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. అందరి కృషి, అంకితభావంతోనే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదయ్యిందని హర్షం వెలిబుచ్చారు. శిక్షణలో ఉత్సాహవంతంగా పాల్గొన్న బాలికలందరు మునుముందు కూడా స్వీయ రక్షణను కొనసాగించే దిశగా కృషి చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

జిల్లా జడ్జి సునీతా కుంచాల మాట్లాడుతూ, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డును శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు, యువతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. మీ అందరి పట్టుదల, కృషితోనే ఇది సాధ్యమయ్యిందని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించాలనే సదాశయంతో గత జనవరి 27వ తేదీన మొదటగా 700 మంది బాలికలకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటివరకు 14 వేల మందికి శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. తాజాగా నిర్వహించిన కార్యక్రమానికి కూడా తమ అంచనాలకు మించి విద్యార్థినులు, వివిధ శాఖల ఉద్యోగినులు హాజరై లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తోడ్పాటును అందించిన జిల్లా యంత్రాంగం, పోలీస్, తదితర శాఖల అధికారులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకున్న వారు ఒక్కొక్కరు కనీసం మరో పది మందికి వాటిని నేర్పాలని, తద్వారా లక్ష మందికి పైగా స్వీయ రక్షణ శిక్షణ పొందినట్లు అవుతుందన్నారు. శిక్షణను నిలిపివేయకుండా మునుముందు కూడా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, న్యాయవాదులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల విద్యార్థినులు, ఉద్యోగినులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న విద్యార్థినులు, పిల్లలు


డ్రోన్‌తో చిత్రీకరణ..


లిమ్కా బుక్ రికార్డ్స్‌లో నమోదు అయినట్టు సర్టిఫికేట్ అందజేత

జీపి కార్మికులకు సన్మానం


కార్మికులను సన్మానించిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని జాన్కంపేట్ గ్రామ పంచాయతీని డీఎల్‌పిఓ సాయిబాబా శనివారం సందర్శించి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఉన్న పలు సమస్యలను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌దాస్‌కు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రేమ్‌దాస్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేత

నవతెలంగాణ-కమర్‌పల్లి
మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఏలేటి బాల్‌రెడ్డి స్రవంతి దంపతులు తమ వంతు సహాయంగా రూ.1లక్ష 111 విరాళంగా అందజేశారు. ఆదివారం విరాళం మొత్తాన్ని దాతలు ఏలేటి బాల్‌రెడ్డి స్రవంతి దంపతుల కూతురు భవ్యంతి చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, సురంగి చంద్రశేఖర్, ఆక్స్‌ఫర్డ్ శ్రీనివాస్, మహేందర్, స్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖకు నిధుల కొరత

- సొంత భవనాలు లేని ఎక్సైజ్ శాఖ
- ఆదాయం తెచ్చే శాఖ అయినా.. నిధుల కొరత
- నూతన ప్రభుత్వం దృష్టిసారించేనా..?

నవతెలంగాణ-ఆర్మూర్
ప్రభుత్వానికి దండిగా ఆదాయం తెచ్చి పెడుతున్న ఎక్సైజ్ శాఖకు నిధుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను చూపుతున్న ఎక్సైజ్ శాఖను ఆదరించాలని ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018వ సంవత్సరంలో సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించింది. అప్పట్లో అంచనా వ్యయం తక్కువగా ఉండడంతో ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.40లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.


పట్టణంలోని మామిడిపల్లి ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మించిన ఎక్సైజ్ శాఖ భవనం

వేధిస్తున్న నిధుల కొరత..
సరైన సమయంలో భవనాల నిర్మాణం ఆరంభించక పోవడం బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఇతరత్రా కారణాలతో అంచనా వ్యయం భారీగా పెరిగిపోయింది. గతంలో మంజూరు చేసిన నిధులతో కేవలం భవన నిర్మాణం పూర్తి చేయగలిగారు. కలర్లు వేయడం, తలుపులు కిటికీలు ఇతర సౌకర్యాలను కల్పించడానికి నిధుల కొరత తీవ్రమైంది. ఒక్కొక్క భవనానికి మూడు నుంచి 6లక్షల వరకు నిధులను విడుదల చేస్తే నిర్మాణం పూర్తి చేసుకున్న ఎక్సైజ్ భవనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఎక్సైజ్ శాఖకు మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే సొంత భవనాలు అందుబాటులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
జిల్లాలోని నిజామాబాద్, బోధన్, మోర్తాడ్, భీంగల్, ఆర్మూర్‌లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. అంతటా సొంత భవనాలు లేకపోవడంతో అద్దె ఇల్లు, ప్రభుత్వం ఆధీనంలోని ఇతర శాఖ భవనాలలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నవి.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన లింబాద్రి

నవతెలంగాణ-భీంగల్ రూరల్
బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. జాగిర్యాల్ గ్రామానికి చెందిన కొనపత్రి లింబాద్రి (53) పెర్కిట్ వెళ్లి జాగిర్యాల్‌కు తిరిగి వస్తుండగా రాత్రి 12గంటల సమయంలో తన బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
జాతీయ ఉపాధి హామీ ద్వారా మంజూరైన సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో మండలంలోని చింతలూర్ గ్రామ అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరు చేయడం వలన చింతలూర్ గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. గెలిచిన అనతి కాలంలోనే గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, ప్రజలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

5న ఉమ్మడి జిల్లాల జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
తెలంగాణ రాష్ట్రం హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీన నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విశాఖనగర్, పెర్కిట్‌లో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల జూనియర్ మేన్ హ్యాండ్‌బాల్స్ ఎంపికలు నిర్వహించనున్నట్టు నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రక్రియలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8,9,10 తేదీలలో వరంగల్ జిల్లా జెడ్‌పిహెచ్‌ఎస్ పైడిపల్లి స్కూల్‌లో జరగబోయే 45వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు తేదీ 01-01-2004 తరువాత జన్మించిన వారై ఉండాలని, తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విశాఖ నగర్, పెర్కిట్, ఆర్మూర్‌లో నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ కోశాధికారి గట్టడి రాజేష్‌కు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండ్ర అంజుకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ


అనాథాశ్రమంలో చిన్నారులకు పండ్లు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు ఉమాజీ నరేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్లు జక్రాన్‌పల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని అనాథాశ్రమంలో పిల్లలందరికీ పండ్లు పంపిణీ చేసి వారి మధ్యనే కేక్ కట్ చేసి స్వీట్ అందజేసినట్టు వినోద్ తెలిపారు. అనాథ పిల్లల మధ్య కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు నరేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని వినోద్ తెలిపారు.

కుక్కల దాడిలో మూడు మేకలు మృత్యువాత



నవతెలంగాణ-నవీపేట్
మండలంలోని ఫకీరా బాద్ గ్రామంలో శనివారం రాత్రి రాథోడ్ మోహన్‌కు చెందిన మూడు మేకలపై కుక్కలు దాడి చేయగా మృతిచెందాయి. మూడు మేకల విలువ సుమారు రూ.40,000 ఉంటుందని గ్రామంలో కుక్కల బెడదను నివారించి జీవాలతో పాటు మనుషుల ప్రాణాలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

జీరో విద్యుత్ బిల్లు

నవతెలంగాణ-మాక్లూర్
మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లును విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు కలిసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో నాలుగో హామీ అయిన గృహజ్యోతి పథకంలో విద్యుత్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, నిరుపేదలకు అండగా ఉండాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకంలో జీరో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని ఇంటింటికీ తిరిగి జీరో బిల్లులపై వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడి అశోక్, ఏఈ గోపి, లైన్మెన్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, మర్ల కిషన్, ఆరిఫ్, అలీమ్, జైల్ సింగ్, బేగరి రాజు, స్వామి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విప్లవోద్యమ నిర్మాణానికి పునరంకితమవ్వాలి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ పిలుపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
జనత ప్రజాతంత్ర విప్లవోద్యమ నిర్మాణానికి ప్రజలంతా పునరంకితం అవ్వాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ పిలుపు ఇచ్చారు. మార్చ్ 3,4,5 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న యూనిటీ మహాసభలకు ఆర్మూర్ డివిజన్ నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు ప్రత్యేక ప్రైవేట్ బస్సుల్లో తరలి వెళ్లారు. ఎర్రజెండాను ఊపి బస్సులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో నేడు విప్లవ కారుల ఐక్యత తక్షణ కర్తవ్యమని, విప్లవ కర్తవ్యం నెరవేర్చడానికి విప్లవ కారులు ఒకే జెండా కిందికి, అదే ఎర్రజెండా కింద ఒకే గొంతుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారకుంటే మన పురోగతి ఉండదు అన్నారు. కమ్యూనిజం ఒక శాస్త్రీయ, సామాజిక శాస్త్రం అని పేర్కొన్న ఆయన, కాలానికి అనుగుణంగా కర్తవ్యలను రూపొందించుకోవడం, పంథా, ప్రణాళికను రూపొందించుకోవడం అత్యవసరం అన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.దేవారం, ఆర్మూర్, బాల్కొండ, జక్రాన్ పల్లి మండలాల సంయుక్త కార్యదర్శి బి.కిషన్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తేన్న, సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.సురేష్, పిఓడబ్ల్యు ఆర్మూర్ డివిజన్ నాయకులు ఎం.సత్తెక్క, పి.రమ, పార్టీ డివిజన్ నాయకులు కే.రాజేశ్వర్, ఆర్.దామోదర్, యు.రాజన్న, బి.బాబన్న, మండలాల నాయకులు ఈ.రమేష్, ఎం.లింబాద్రి, అశోక్, తెలంగాణ ప్రగతిశీల భీడీవర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) నాయకులు నసీర్, ఏఐపికే ఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కిషన్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మండల కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నరు.



సభకు తరలివెళ్తున్న బస్సులను ప్రారంభిస్తున్న వి.ప్రభాకర్

బోధన్ వాసికి డైమాండ్ ఆఫ్ ఇండియా అవార్డు



అవార్డు అందుకుంటున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్
బోధన్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంరావు తనయుడు దినేష్ పాటిల్‌కు ఆదివారం మహారాష్ట్రలోని పుణే నగరంలో గ్లోబల్ స్కాలర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పురస్కారాల కార్యక్రమంలో డైమాండ్ ఆఫ్ ఇండియా అవార్డును పద్మశ్రీ అవార్డు గ్రహీత మిలియన్ కాంబ్లే దినేష్ పాటిల్‌కు ఈ అవార్డు ప్రదానం చేశారు. హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న దినేష్ పాటిల్ గతంలో సేవా రత్న, బసవ రత్న, ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు సామాజిక న్యాయ సేవలపై తనకు మరింత బాధ్యత పెంచిందని ఆయన తెలిపారు.

అమర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం


డాక్టర్ అమర్‌ను అభినందిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని డాక్టర్ అమర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాంగ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గగ్గుపల్లి శ్యామ్, కార్యదర్శి భూమిని రాజేశ్వర్, మామిడిపల్లి సురేష్, అరుణ్, వినయ్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కప్పలవాగు, పెద్దవాగులో

ప్యాకేజ్ 21 ఔట్‌లెట్ ద్వారా నీళ్లు వదలాలి

- లేదంటే వాగు పరివాహక గ్రామ రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాట కార్యాచరణలో దిగుతాం
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
బాల్కొండ నియోజకవర్గంలో ప్రవహించే కప్పలవాగు, పెద్దవాగులో ప్యాకెజ్ 21 ద్వారా ఏర్పాటు చేసిన ఔట్‌లెట్‌ల ద్వారా వాగుల్లోకి నీరు అందించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాగు పరివాహక గ్రామాల రైతుల కోరిక మేరకు గడిచిన 20రోజుల క్రితమే ఇరిగేషన్ సీఈతో ఫోన్లో మాట్లాడి ఎమ్మెల్యేగా లెటర్ ద్వారా కూడా నీళ్ల వదలాలని విన్నవించడం జరిగిందన్నారు. అధికారులు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ, నీటి విడుదల విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా నీటిని వాగుల్లో వదలకపోతే ఆ రెండు వాగుల వెంబడి ఉన్న గ్రామాల వరి పంటలు ఎండిపోయే అవకాశం ఉన్నదని అన్నారు. బాబ్లీ నుంచి కూడా శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు నీళ్ల వదిలినందున మొదటి విడతగా రోజుకు 300 క్యూసెక్కుల చొప్పున 10రోజులు 0.5 టీఎంసీ నీరు వదలాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రెండు రోజులు వేచి చూసి ఒకవేళ ఈ ప్రభుత్వం నీళ్ల వదలకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా పరివాహక గ్రామాల రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాట కార్యాచరణ ఉంటుందని ఎమ్మెల్యే తెలియజేశారు.


అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కోడంగల్‌తో సమానంగా నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
కొడంగల్‌తో సమానంగా ఆర్మూర్ నియోజ కవర్గానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. ముఖ్యమంత్రి తన నియోజకవర్గానికి రూ.1424కోట్ల నిధులు కేటాయించారని, అలాగే ఆర్మూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కోసం, ఆసుపత్రిలో పరికరాల కోసం కూడా సమానంగా నిధులు కేటాయించాలని కోరారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

లిఫ్ట్ పనులను పరిశీలించిన జెడ్పీ చైర్మన్



నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని బొంకన్‌పల్లి గ్రామ శివారులో జరుగుతున్న ఇరిగేషన్ లిఫ్ట్ పనులను జిల్లా జెడ్పీ చైర్మన్ డి.విఠల్‌రావు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మిత్రుడి కూతురి పెండ్లికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం చేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-బోధన్
మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన పర్వయ్య కళావతి దంపతుల కూతురు శిరీష వివాహం సందర్భంగా ఆదివారం 1984-85 ఎస్సెస్సీ బ్యాచ్ క్లాస్ మెంట్స్‌లు కలిసి స్నేహితుని కూతురి పెళ్లికి రూ.78,800 ఆర్థిక సహాయం అందించారు. స్నేహితుడు నిరుపేద కుటుంబం కావడంతో ఆయన ఇబ్బందులు గ్రహించి స్నేహితుడి కూతురి పెళ్లికి తమవంతుగా తక్షణ సహాయం అందించాలని సంకల్పించి తక్షణమే రూ.78,800 సేకరించి అందించారు. అలాగే నగదుతో పాటు పెళ్లికి సరిపడా బియ్యం, పప్పులు అందించారు. తన చిన్ననాటి స్నేహితులు తన కూతురు పెళ్లికి నగదు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవడంతో పరువయ్య కళావతి దంపతులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాల కిషన్(కిషన్ ఆర్ట్స్), ముక్క శ్రీనివాస్, దాసరి వెంకటేష్, కేతావత్ బిల్లు సింగ్, త్రినాథం, సల్ల రాజేశ్వర్‌రెడ్డి, గాండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఉదయం వేల్పూర్ మండలం అమీనాపూర్ సాయిబాబా ఫంక్షన్‌హాల్లో బిఆర్ఎస్ నాయకులు దత్తాద్రి కూతురు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మధ్యాహ్నం ముప్కాల్ మణికంఠ ఫంక్షన్‌హాల్‌లో జలాల్‌పూర్ బిఆర్ఎస్ నాయకులు జక్కనర్సారెడ్డి కూతురు వివాహ వేడుకకు హాజరయ్యారు. కమ్మర్‌పల్లి మండల కేంద్ర శివారులోని లలిత గార్డెన్‌లో బిఆర్ఎస్ సైనిక్ ఋగ్వేద్ చెల్లి వివాహ వేడుకల్లో పాల్గొని కొత్త దంపతులను ఆశీర్వదించారు. సాయంత్రం వేల్పూర్ మండలంలోని లక్కోర ఏఎస్‌జి ఫంక్షన్‌హాల్‌లో జర్నలిస్ట్ రాజేందర్ చారి కుమారుని వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


పెళ్లి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిరుద్యోగులను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం

- సిపిఐ


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి
నిరుద్యోగులను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని సిపిఐ నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి దుబాస్ రాములు, కోటగిరి మండల కార్యదర్శి ఎ.విటల్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేసిందని వారు విమర్శించారు. రైతాంగం పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో వైఫల్యం చెందిందని, గిట్టుబాటు ధర కొరకు దేశ రాజధాని ఢిల్లీలో రైతులు ఉద్యమాలు నిర్వహిస్తుంటే రైతులపై ఉక్కుపాదం మోపడం సరైనది కాదని, రైతులకు వ్యతిరేకంగా ఉన్న నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రంగాన్ని, బొగ్గు గనులను, బిఎస్ఎన్ఎల్, విమానం రంగాలను, భారత దేశ ఆస్తులను ప్రైవేట్ పరం చేయడం, కార్పొరేట్ వ్యక్తులకు దారదత్తం చేయడంలో బీజేపీ దిట్ట అని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బిజెపి హటావో, దేశ్‌కో బచావో నినాదంతో ఉద్యమాలకు కార్మిక వర్గం ప్రజలు, రైతులు నిరుద్యోగులు సిద్ధం కావాలని తెలిపారు. సమావేశంలో సిపిఐ నాయకులు నల్ల గంగాధర్, బూదాల రాములు, హనుమాండ్లు, నగేష్, వీరేశం, మునీర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

3

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కామారెడ్డి

సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



నవతెలంగాణ-సదాశివనగర్

ఇటీవల విడుదల చేసి పీజీటీ పోస్టుల ఫలితాల్లో ఉద్యోగానికి అర్హత సాధించిన సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన నాయిని గోపాల్‌ని పలువురు ఆదివారం సన్మానించారు. ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్యచ, నాయకులు బొంబాయి మల్లయ్య, మర్కంటి దాకయ్య నాయిని గంగయ్య చింధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త కొరత లేని సమాజాన్ని నిర్మిద్దాం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో జంగంపల్లి పోశవ్వ (58) ప్రమాదవశాత్తు కాలు విరిగిపోవడంతో ఆపరేషన్ నిమిత్తమై పాజిటివ్ 'ఏ' రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్త నిల్వలు రక్తనిధి కేంద్రంలో లభించలేదు. దీంతో సింగరాయపల్లి గ్రామానికి చెందిన అల్లే అనిల్ మానవతా దృక్పథంతో స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేసి ఆపరేషన్ విజయవంతం అయ్యేలాగా కృషి చేశారని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. రక్త కొరత లేని సమాజాన్ని ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు.

తక్కువ ఖర్చుతో అధిక లాభం

- మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి
- రోజురోజుకూ పెరుగుతున్న సాగు విస్తీర్ణం

నవతెలంగాణ-జుక్కల్

అధునాత సాగు పద్ధతులపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త విధానాలతో దిగుబడి ఎక్కువగా వస్తుండటంతో మిగతా రైతులు సైతం అమలు పరుస్తున్నారు. దీంట్లో భాగంగా మల్చింగ్ విధానాన్ని ఎక్కువ మంది రైతులు చేపట్టేందుకు ముందుకు వస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొంది ఎక్కువ లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

జుక్కల్ మండలంలో మల్చింగ్ విధానంలో సాగుచేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పూర్వ కాలం నుండి పండే పలు రకాల పంటలను సంవత్సరాల తరబడి రైతులు పంట సాగు చేస్తున్నారు. దీంతో పంట మార్పిడి చేయక పోవడంతో దిగుబడి తగ్గుతు వచ్చింది. అధికారుల అవగాహన కార్యక్రమాలతో రైతుల ఆలోచనల్లో మార్పు వచ్చింది. కాలానికి అనుగుణంగా పంటల సాగుకు కొత్తకొత్త విధానాలు అవలంభించేందుకు ముందుకు వస్తున్నారు.

చదువుకున్నా.. అందుకు తగ్గట్టు ఉద్యోగాలు రాకపోవడంతో భూములున్న వారు రైతులుగా మారుతున్నారు. వీరు అధునిక సాగు పద్ధతులను వినియోగిస్తున్నారు. యంత్రాలను వాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేవిధంగా ప్రణాళికలు , వ్యయం లెక్కలు కడుతూ వివిధ రకాల పద్ధతిలో పంటల సాగు చేస్తున్నారు. సాంప్రదాయ పద్ధతులను విడిచి.. అధునిక పద్ధతులు అవలంబిస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించేనా.?

రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభూత్వం మల్చింగ్ విధానంలో సాగు చేసే రైతులకు రాయితీలు ఇవ్వాలని, ఉద్యానవన శాఖను తిరిగి ఇప్పుడున్న రాష్ట్ర ప్రభూత్వం పటిష్టం చేస్తే రైతులకు సూచనలు, సలహాలు చేసే ఉద్యానవన శాఖ అధికారులను, రైతులను మేలు చేసిన వారౌతారని రైతులు ప్రభూత్వానికి విన్నవిస్తున్నారు.

హర్టీకల్చర్ డిపార్ట్‌మెంట్‌ను వ్యవసాయ శాఖలో విలీనం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హర్టీకల్చర్ శాఖను పూర్తిగా తొలగించి వ్యవసాయ శాఖలో విలీనం చేసింది. గతంలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ వేరువేరుగా ఉండేది. కాంట్రాక్టు పద్ధతి పైన హర్టీకల్చర్ శాఖలో కొంత మంది అధికారులను నియమించినప్పటికీ ఉద్యానవన శాఖలో విధులు నిర్వహిస్తున్న వారికి గౌరవ వేతనాలు సరైన సమయంలో చెల్లించక పోవడంతో తొంబై శాతం కాంట్రాక్టు ఉద్యోగులు విధులను నిర్వహించలేక వదిలి బయటికి వెళ్లి పోయారు.

ఎకరాకు ఒక లక్ష ఖర్చు..

మల్చింగ్ విధానంలో పంట సాగు చేయలంటే సుమారుగా ఎకరాకు లక్ష ఖర్చు అవుతున్నట్టు సమాచారం. మండలంలో బొప్పాయి, జామ, తర్బూజ, తమాటా, వంకాయ తదితర పంటలు మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్నారు. వీటితో పాటు కూరగాయలు, పండ్లతోటలు, ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులు మల్చింగ్ విధానం ఎంచుకుంటున్నారు. నీటి వసతి కలిగి ఉన్న రైతులకు ఈ పద్ధతి ఉపయోగకరం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. ప్రయివేటు వారే వచ్చి క్షేత్రస్థాయిలోకి వచ్చి గంపగుత్తగా మల్చింగ్ విధానం చేసి ఇచ్చి వెళ్తున్నారు. తరువాత రైతు విత్తనాలను వేసుకోవడమే తరువాయి. రైతు మల్చింగ్ విధానంలో విత్తనాల కొనుగోలులో తప్పక మెళుకువలు పాటిస్తున్నారు. నాణ్యమైనవి కొనుగోలు చేస్తూ విత్తుకుంటున్నారు.

సాగు ఖర్చు తక్కువ... లాభం ఎక్కువ..

రైతులకు సాగు ఖర్చు పూర్తీగా సుమారుగా ఎనబై శాతం మల్చింగ్ విధానంలో తగ్గిపోతోంది. డ్రిప్ ద్వారా మల్చింగ్ విధానంలో పంట సాగుకు విత్తనాలు ఉన్న చోటనెట బిందు సేద్యంలో నీటిని, రసాయన ఎరువులు, మందులు నేరుగా మొక్క మొదళ్లకు వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తారు.. కాబట్టి సమస్య ఉండదు. నీరు తక్కువగా ఉన్న బోరుబావుల రైతులకు చాలా ఉపయోగకరం. కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉంటదు. చీడపీడల బెడద ఉండదు. మల్చింగ్ విధానంలో పంట దిగుబడి రెండింతలు పెరుగుతుంది. నాణ్యమైన దిగుబడి వస్తుండగటంతో ధర సైతం ఎక్కువగా వస్తున్నట్టు రైతులు పేర్కొంటున్నారు. మల్చింగ్ విధనంలో మండలంలో సుమారుగా రెండు వేల పై చిలుకు ఎకరాలలో వివిధ రకాల పంట సాగు చేస్తున్నారు.

జీరో కరెంట్ బిల్లుతో.. మహిళల్లో చిరునవ్వు

- చెప్పిన పనులు చేసేదే కాంగ్రెస్ పార్టీ
- ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-నిజాంసాగర్



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్టు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు అన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో కరెంట్ బిల్లు వస్తుంటే మహిళల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తుందని తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఐదు లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు ఏర్పాటు శంకుస్థాపన చేశారు. అనతరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా పలువురు పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. తదనంతరం గృహ జ్యోతి పథకాన్ని ఎమ్మెల్యే ఆరేడు గ్రామంలో ప్రారంభించారు. జీరో కరెంట్ బిల్లును కొట్టి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మేము అధికారంలోకి రాగానే ఏవైతే హామీలను ఇచ్చామో వాటన్నింటినీ అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. జీరో కరెంట్ బిల్లు కొట్టి మహిళలకు ఇస్తే ఎంతో సంతోషపడుతున్నారని అన్నారు. త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ కూడా చేపడుతున్నామని అందుకు తగ్గ కార్యచరణ సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్ పటేల్, మెడికల్ ఆఫీసర్ రోహిత్ విద్యుత్ శాఖ అధికారి లక్ష్మణ్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్' దోపిడీ

- ఇష్టానుసారంగా చార్జీలు
- నిర్వాహకుల తప్పలకు బలవుతున్న సామాన్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రస్తుతం.. ప్రతి పనికి ఆధార్ కార్డే ప్రామాణికంగా మారింది. కేవైసీ, పీఎఫ్, బ్యాంక్ ఖాతా ఇలా ప్రతిదానికి ఆధార్ కార్డు వివరాలను జత చేస్తున్నారు. అయితే ఆధార్‌లో ఉన్న తప్పులను సవరించుకునేందుకు ప్రజల జెబులకు చిల్లులు పడుతున్నాయి. నిర్ణయించిన రుసుం ఒకటైతే.. వసూలు చేసేది అంతకు రెండుమూడింతలు ఉంటుంది. డబ్బులు వెచ్చిస్తున్నా.. ఆధార్ సెంటర్ నిర్వహకులు చేసే తప్పులకు సామాన్యులు బలవుతున్నారు. ఆధార్‌లో లింగం, పేరు మార్పిడి, పుట్టినరోజు మార్పిడి తదితర వాటికి సవరణలకు పరిమితి ఉండగా.. ఆధార్ సెంటర్ నిర్వహకులు తప్పుగా నమోదు చేస్తుండటంతో వాటిని సవరించుకునేందుకు సామాన్యులు హైదరాబాద్‌కు వెళ్ల అనేక వ్యయప్రయాసాలకు ఓరుస్తున్నారు.

ఆధార్ కార్డులో ఏ ఒక్క తప్పు ఉన్నా ఇక్కట్లు వస్తున్న కారణంగా ప్రజలకు ఆధార్ కార్డు సరి చేసుకోవాల్సిన అవసరం తప్పనిసరి అయిపోయింది. ఆధార్ కార్డులో స్టడీ సర్టిఫికెట్ లో ఉన్న విధంగా పేరు, తండ్రి పేరు సరిగ్గా లేకున్నా, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింకు లేకున్నా ఆధార్ సెంటర్ కు వెళ్లి సరి చేసుకోవాలి. దీనిని అదునుగా చేసుకొని ఆధార్ సెంటర్ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆధార్ దిగిన తర్వాత ఇచ్చిన వేలిముద్రల రసీదులో నగదు ఎంత చెల్లించాలో ఉంటుంది కానీ నిర్వాహకులు అదనంగా 50 నుండి 100 రూపాయలు ఎక్కువగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఎందుకని ప్రశ్నిస్తే ఆధార్ కార్డు దించము మీకు నచ్చిన చోట చెప్పుకోండి అని దురుసుగా మాట్లాడు తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొంద రు ఆధార్ సెంటర్ నిర్వాహకులు అవగాహన లోపం కారణంగా మగవారికి ఆడవారు అని ఆడవారికి మగవారు అని నమోదు చేయడం కారణంగా మరలా తప్పు సవరణ కాకపోవడంతో తప్పును సరి చేయడానికి హైదరాబాద్ హెడ్ ఆఫీస్ ఆధార్ సెంటర్ చుట్టూ తిరగుతున్నారు. ఆధార్ కేంద్ర సెంటర్ నిర్వాహకుల తప్పు కారణంగా తప్పును సరి చేయడానికి దిగడానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రైవేటు ఏజెన్సీలు తమ ఇష్టానుసారంగా ఆధార్ సెంటర్ లను మంజూరు చేయడం వలన నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆధార్ సెంటర్ లకు, ప్రైవేట్ ఆధార్ సెంటర్లకు ఒకే విధమైన చార్జీలు ఉంటాయి. కానీ ఇది ప్రైవేట్ ఆధార్ సెంటర్ మాకు నచ్చిన ధర తీసుకోవచ్చు అన్న విధంగా కొందరు ప్రైవేట్, ప్రభుత్వ ఆధార్ సెంటర్ నిర్వాహకులు దోపిడికి పాల్పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఆధార్ సెంటర్ నిర్వాహకుల దోపిడిని అరికట్టాలని, ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఆధార్ సెంటర్ లపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

నాటు బాంబు పేలి మహిళకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రమాదవశాత్తు నాటు బాబు పేలి మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అన్నారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దండుగుల శిరీష ఇంట్లో ప్రమాదవశాత్తు నాటు బాబు పేలి తీవ్ర గాయాల అవడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మందు గుండు సామాగ్రి అడవి పందుల షికారి కోసం ఇంట్లో నిల్వ ఉంచినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే ట్యాంక్‌బండ్..

- ఆహ్లాదానికి దూరం
- మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



లైట్‌లు ఆర్పేయడంతో ట్యాంక్‌బండ్‌పై చిమ్మచీకట్లు

నిజామాబాద్ నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసి ట్యాంక్ బండ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సమయ వేళలు ఏర్పాటు చేయకుండానే అక్కడున్న సిబ్బంది లైట్‌లు ఆర్పేయడంతో ఆదివారం చిమ్మచీకట్లు అలుముకున్నాయి. అక్కడికి వచ్చిన వారు ఒక్కసారిగా కంగుతిన్నారు. కనీసం సమాచారం ఇవ్వరా అని అక్కడున్న సిబ్బందిని అడిగితే.. మద్యం సేవించి ఉండటంతో పర్యాటకులతో గొడవకు దిగుతుండటం విశేషం. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ట్యాంక్‌బండ్‌లో ప్రజలకు కనీస సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. మందు తాగి సెక్యూరిటీ గార్డ్ విధులు నిర్వర్తిస్తున్నారని, ట్యాంకు బండ్ సమయపాలన బోర్డులు ఎక్కడ ఏర్పాటు చేయలేదని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి 8 గంటలు కాగానే కనీస సమాచారం ఇవ్వకుండా లైట్‌లు ఆర్పేయడంతో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. సందర్శకులు ఎవరికీ చెప్పుకోలేనంత ఇబ్బందులు పడుతూ, చిన్న పిల్లలు మిస్ అయి వెతుక్కుంటూ వారిని పట్టుకుని, ముందుకు సాగి ట్యాంక్ బండ్ కాళీ చేయడం జరిగింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులను సమాచారం లేకుండా విద్యుత్ దీపాలను ఎందుకు ఆర్పిస్తున్నారని సందర్శకులు ప్రశ్నిస్తే, సందర్శకులతోనే అక్కడ ఉన్న సిబ్బంది (సెక్యూరిటీ గార్డ్స్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఇతరులు) గొడవలు పడుతూ, తాగి ఉన్న సెక్యూరిటీ గార్డ్ లే, సందర్శకులను ఇబ్బంది పెట్టే విధంగా వీడియోలు తీస్తుండటం గమనార్హం.

అంతేకాకుండా అక్కడ ఉన్న కానిస్టేబుల్ ఇక్కడ సమయపాలన అందరికీ తెలుసు, మీకు తెలియదా... మీరు తెలుసుకోరా... అని సందర్శకులని బెదిరింపులకు పాల్పడటం గమనార్హం.

నిండుజీవితానికి రెండు చుక్కలు

- జలుబు, దగ్గు ఉన్నా చుక్కల మందు వేయించొచ్చు
- జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో

నతెలంగాణ-కామారెడ్డి

చిన్నారులకు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా కూడా పోలియో చుక్కల మందు వేయించొచ్చని ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ. శతశాతం లక్ష్యాన్ని విజయవంతం చేయడానికి ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు సహకారం అందించాలని తెలిపారు. 4,5వ తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు చుక్కల మందు వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. జిల్లాలో 733 పల్స్ పోలియో బృందాలు, 48 సంచార బృందాలను ఏర్పాటు ఏర్పాటు చేశారన్నారు. 2,932 మంది ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, 69 మంది పర్యవేక్షణ అధికారులు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఇందూ ప్రియ, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సుజాత, వైద్యులు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఎన్ సి సి వాలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

బిచ్కుంద : పుట్టిన నుండి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో నివారణకు ప్రభుత్వం చేపట్టిన మూడు రోజుల పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంబించారు. వైద్య సిబ్బంది మండలంలోని అంగన్వాడి సెంటర్లు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, బస్టాండ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు సురేష్ గోండ మండల కేంద్రంలోని బస్టాండ్ లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో నివారణకు పోలియో చుక్కల మందు తప్పక వేయించాలని ఈ సందర్భంగా సూచించారు.

మద్నూర్ : మద్నూర్ మండలంలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో ఉదయం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీటీసీ సంగీత కుశాల్ చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంబించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0.5 వయస్సు చిన్నారి పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆశ వర్కర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పోలియో చుక్కలను దోమకొండ జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సంజీవ్ జార్జ్, సూపర్వైజర్ ప్రభావతి, ఎంఎల్ హెచ్పి జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ప్రభుత్వం ద్వారా పల్స్ పోలియో చుక్కలను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల్లో ఎంపిటిసిలు, అధికారులు ఆదివారం ప్రారంభించారు. అన్నారం పిహెచ్సి పరిధిలో 85%, రామారెడ్డి పిహెచ్సి పరిధిలో 90% పిల్లలకు పోలియో చుక్కలు అందజేసిన పిహెచ్సి వైద్యులు మానస, సురేష్ తెలిపారు.

తాడ్వాయిలో 93 శాతం పల్స్ పోలియో

తాడ్వాయి : తాడ్వాయి మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో 93 శాతం నమోదయింది. మండలంలో మొత్తం 5945 మంది చిన్నారులు ఉండగా ఒక్కరోజే 5555 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్టు వైద్యాధికారి నజ్మీరా తెలిపారు. మండలంలో మొత్తం 29 బూతులు ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి చుక్కల మందు పూర్తి చేసినట్టు తెలిపారు మిగతా శాతం రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ ఈఊ నారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు చుక్కలే పిల్లల భవిష్యత్తు

నిజాంసాగర్ : ఉమ్మడి మండలంలోని మహమ్మద్ నగర్ గ్రామపంచాయతీలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం ద్వారా వారికి పోలియో రాకుండా ఉంటుందని అన్నారు. పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. రెండు చుక్కల పోలియో పిల్లల భవిష్యత్తుకు నాంది అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు తోటరాజు, తుకారం, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చక్కని భవిష్యత్తుకు చుక్కల మందు : పోలియో చుక్కలను వేసిన ఎంపీపీ

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని ఏర్పాటుచేసిన పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరో రెండు రోజులు ఈ కార్యక్రమం జరగనుందని, చుక్కల మందు వేయించని వారందరూ తమ ఐదేండ్లలోపు పిల్లలకు వేయించాలని సూచించారు.

కామారెడ్డి : ఐదు సంవత్సరాల లోపల ఉన్న ప్రతి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ రవళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిఏలు శాంతా బాయి, రేఖ, ఆశ వర్కర్లు భవ్య, శైలజ, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఐదు సంవత్సరాలలో పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

కామారెడ్డి : బీబీపేట్ మండలం మందాపూర్ గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చావిడి వద్ద ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్ గౌడ్ పాల్గొని 05 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వచ్చే అనేక వ్యాధుల్లో పోలియో ఒకటని ఇది వస్తే, పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి, కాళ్లు, చేతులూ వంకర అవుతాయన్నారు. కొన్ని కేసుల్లో మెదడుకి కూడా వ్యాపిస్తోందని ఇలా అవయవాలకు కూడా వైకల్యం సంభవిస్తుందన్నారు. ఇది అంటువ్యాధి కాదని దీన్ని రాకుండా అడ్డుకోవడానికి ఏకైక మార్గం పోలియో చుక్కలని అదే చుక్కల మందని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ రెడ్ క్రాస్ మెంబర్, హెల్త్ అసిస్టెంట్ వినోద్ కుమార్, సుజాత, ఏఎన్ఎం లక్ష్మి, గోదావరి, శోభ,సురేఖ,స్వామీ, వెంకటలక్ష్మి, మంజుల బుజ్జమ్మ పాల్గొన్నారు.



కామారెడ్డిలో...



మద్నూర్: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ



రామారెడ్డి: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న నారెడ్డి మోహన్‌రెడ్డి



పెద్దకొడప్‌గల్: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ

రాజరాజేశ్వర ఆలయానికి తాగునీటి ట్యాంకర్ల విరాళం

నవతెలంగాణ-నవీపేట్



తాగునీటి ట్యాంకర్లు అందజేత

మండలంలోని నాళేశ్వర్ గ్రామ శ్రీరాజరాజేశ్వర ఆలయానికి అదే గ్రామానికి చెందిన కోనేరు పెద్ద బీమారెడ్డి నాలుగు తాగునీటి ట్యాంకర్లను సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, తాజా మాజీ సర్పంచ్ సరీన్‌కు ఆదివారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నదాన కార్యక్రమం దృష్ట్యా ట్యాంకర్లను అందించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కోనేరు సుధాకర్, ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, విడిసి సభ్యులు సురేష్, స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా రోడ్లు

నవతెలంగాణ-రెంజల్



రోడ్డుకు ఇరువైపలా ఏపుగా పెరిగిన చెట్లు

హరితహారంలో భాగంగా రోడ్ల కిరువైపులా నాటిన మొక్కలు నేడు పెరిగి ఆహ్లాదకరంగా మారాయి. వేసవిలో వాహనదారులకు సేద తీర్చుకోవడానికి దోహదపడుతున్నాయి. మండలంలోని కళ్యాపూర్ నుంచి కందకుర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు మహా వృక్షాలుగా మారి నీడను అందిస్తున్నాయి. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

ధర్మారం వాసికి మూడు ఉద్యోగాలు

నవతెలంగాణ-నవీపేట్



మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు సాయిలు 3 ఉద్యోగాలు సాధించాడు. ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు పోశెట్టి గౌరమ్మల కుమారుడైన చిన్న సాయిలు గురుకుల పిజిటి, టీజీటీ సోషల్‌లతో పాటు టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసిన గ్రూప్-4లో సైతం మంచిర్యాంకు సాధించాడు. పిజిటి సోషల్‌లో రాష్ట్రస్థాయి ఏడవ ర్యాంకు, మల్టీ జోనల్ ఒకటిలో మొదటి ర్యాంకు సాధించాడు. సాయిలు విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తి చేసి రెండు సంవత్సరాలుగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. వారం రోజుల వ్యవధిలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సాయిలుకు కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జనతా ప్రజాతంత్ర విప్లవోద్యమ నిర్మాణానికి పునరంకితమవుదాం



మహాసభలకు తరలిన కార్యకర్తలు

నవతెలంగాణ-సిరికొండ

జనతా ప్రజాతంత్ర విప్లవోద్యమ నిర్మాణానికి పునరంకితమవుదామని సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ పిలుపు పిలుపునిచ్చారు. మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగుతున్న యూనిటీ మహాసభలకు ఆర్మూర్ డివిజన్ నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు ప్రత్యేక ప్రయివేట్ బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామంలో బస్సులో కార్యకర్తలతో తరలివెళ్లిన సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో నేడు విప్లవ కారుల ఐక్యత తక్షణ కర్తవ్యమని తెలిపారు. విప్లవ కర్తవ్యం నెరవేర్చడానికి విప్లవకారులు ఒకే జెండా కిందికి అదే ఎర్రజెండా కింద ఒకే గొంతుగా పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారకుంటే మన పురోగతి ఉండదు అని చెప్పారు. కమ్యూనిజం ఒక శాస్త్రీయ సామాజిక శాస్త్రం అని కాలానికి అనుగుణంగా కర్తవ్యాలను రూపొందించుకోవడం, పంథా, ప్రణాళికను రూపొందించుకోవడం అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు ఆర్.దామోదర్, బాబన్న లింబన్న, సాయిరెడ్డి, పీవోడబ్ల్యూ ఆర్మూర్ డివిజన్ నాయకులు రమ, పుష్పలత, పార్టీ మండలాల నాయకులు రమేష్, కిషన్, భూమేష్, సర్పంచ్ సాయిలు, పెద్దసాయిలు, నవీన్, రాజేందర్, పీవోడబ్ల్యూ మండల నాయకులు మానస, స్వరూప, జమున, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త

- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మద్యానికి బానిసై భార్యను చంపిన భర్తను డిచ్‌పల్లి సీఐ శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. జక్రాన్‌పల్లి మండలం నూర్‌సింగ్ తాండాకు చెందిన కేలోత్ సరితకు 20 ఏండ్ల క్రితం అదే గ్రామానికి చెందిన కేలోత్ శ్రీనివాస్ అలియాస్ సుధాకర్ అనే వ్యక్తితో వివాహమైంది. శ్రీనివాస్ మద్యానికి బానిసై తరుచుగా భార్యతో గొడవ పడుతూ చిత్రహింసలకు గురిచేస్తూ కొడుతూ ఉండేవాడు. 01.03.2024 న మధ్యాహ్నం సరితతో గొడవ పెట్టుకున్నాడు. ఎలాగైనా చంపాలని అనుకుని పథకం ప్రకారం అదేరోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మృతురాలితో గొడవ పడి చేతులతో ముఖంపైన పిడిగుద్దులు గుద్ది ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె తలపైన ఇతర చోట్ల విపరీతంగా దాడిచేశాడు. దీంతో సరిత అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటనను పోలీసులు పరిశీలించి తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కాగా మృతురాలి భర్త కేలోత్ శ్రీనివాస్‌ను నిందితుడిగా గుర్తించి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

- మాదిగ హక్కుల దండోరా



మాట్లాడుతున్న మాదిగ హక్కుల దండోరా నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యలపై ఇక పోరాటం చేస్తామని, హక్కుల కోసం ఉద్యమిస్తామని మాదిగ హక్కుల దండోరా నాయకులు తెలిపారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో 'మాదిగ హక్కుల దండోరా' సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి రేగుంట సునీల్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో పలు అంశాలు చర్చించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల పోరాటాలతో అందరినీ చైతన్యం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రేగుంట సునీల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, అరుణ్, శ్రీనివాస్, మహేష్, రాజు, సంజీవ్, సునీల్, వినోద్, మహేష్, రాజ్ కుమార్, గోపి, రాజు, భవాని రెడ్డి,సుదర్శన్, సాగర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బలోపేతం దిశగా..

- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని సీఎం ఆదేశం
- జిల్లాలో చాలా చోట్ల అద్దెభవనాల్లోనే కొనసాగింపు
- కొత్త నిర్ణయంతో మరింత బలోపేతం కానున్న కేంద్రాలు

నవతెలంగాణ-ఆర్మూర్

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే శనివారం సీఎం రేవంత్‌రెడ్డి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో అధికారులకు పలు సూచనలు చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నింటికి మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. అలాగే బయోమెట్రిక్‌ను అమలు చేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసినా.. సక్రమంగా చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందా..? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలోని ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టులు నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, భీంగల్, ఆర్మూర్ పరిధిలో ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1500 అంగన్వాడీ కేంద్రాలుండగా.. అందులో ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు 1365, మినీ అంగన్వాడీ కేంద్రాలు 135 ఉన్నాయి. అందులో ఆరేండ్లలోపు చిన్నారులు 81,245 మంది, గర్భిణులు 14,157 మంది, బాలింతలు 11,304మంది ఉన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. కొన్నింటికి మాత్రమే పక్కా భవనాలున్నాయి.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యం. కాగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న గుడ్లు, పాలు, బియ్యం, ఇతర పౌష్టికాహార పదార్థాలు క్షేత్రస్థాయిలో అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి తోడు సొంత భవనాలు లేక అద్దె ఇండ్లల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పట్టణంలోని రాంనగర్ కాలనీలోని అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం..

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం ఏ మేరకు అందుతుంది. ఎక్కడైనా పంపిణీ చేయకుండా ఉండే పరిస్థితులు ఉన్నాయా అని అంశాల పరిశీలనను ఈ యాప్‌లో నమోదు చేసిన వివ రాల ద్వారా తెలుసుకునే అవకాశాలున్నాయి. ఇందుకోసం గత ప్రభుత్వం ఎన్‌హెచ్‌టిఎస్ (న్యూట్రీషియన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో టీచర్లు రోజువారీగా పౌష్టికాహారం, పిల్లల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేయాల్సి ఉండడంతో పారదర్శకత పెరగనుంది.

చిన్నారులకు పౌష్టికాహారం..

పౌష్టికాహార లోపంతో చిన్నారులు ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాల నుంచి గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. గర్భిణీలు తీసుకునే పౌష్టికాహారంతోనే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యం, బరువు ఆధారపడి ఉంటుంది. బిడ్డ పుట్టిన తర్వాత బాలింతకు పౌష్టికాహారం ఇస్తుండగా ఎదుగుదలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని చిన్నారులకు ఆరెండ్లు వచ్చేవరకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది. చిన్నారి ఎత్తు బరువు భుజం చుట్టుకొలతలను నమోదు చేసి ఆ వివరాల ప్రకారం చిన్నారులు ఆరోగ్యంగా ఉన్నారా లేదా అనే వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరచాలి. ఈ వివరాలతో మరింత పౌష్టికాహారాన్ని అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రిజిస్టర్ వ్యవస్థకు చెక్ పెట్టినా..

అంగన్వాడీ కేంద్రాలలో రిజిస్టర్ వ్యవస్థకు చెక్‌పెట్టినా కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, కిషోర బాలికల వివరాలను వారికి అందించే పౌష్టికాహారంతో పాటు ఎత్తు, కొలతలు కేంద్రానికి వచ్చే సరుకుల వివరాలు మొత్తం ఆన్‌లైన్ చేస్తూ సమాచారమంతా స్మార్ట్ మొబైల్ ఫోన్‌లోని ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించి పొందుపరుస్తున్నారు.

నిర్వహణ భారమై..

ప్రతినెలా గర్భిణీలు, చిన్నారుల సంఖ్య పెరుగుతుంది. అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు ప్రాథమిక విద్య నేర్పిస్తుంటారు. వారి బరువు ఎత్తు కొలతలు తీసుకొని ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారిస్తున్నారు. వీటన్నింటిని చేపట్టడానికి సమస్యలు ఎదురవుతున్నవి. కనీసం మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం సరిగా ఉండటం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న సరుకులను నిల్వ చేసేందుకు కూడా స్థలం సరిపోవడం లేదు. ఇరుకు గదుల్లోనే ప్రాథమిక విద్యాబోధన కొనసాగిస్తున్నారు.

ఆర్మూర్ ప్రాజెక్టు పరిధిలో ఇలా..

ఆర్మూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 326 అంగన్వాడి కేంద్రాలున్నాయి. ఇందులో కేవలం 44 కేంద్రాలే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో 174, ఉచిత భవనాల్లో 100 వరకు నిర్వహిస్తున్నారు. గర్భిణీలు 2496 మంది, బాలింతలు 2324 మంది, ఏడు నెలల నుంచి ఏడాది వయసున్న పిల్లలు 2652 మంది, మూడు సంవత్సరాల వారు 8295 మంది, ఆరేళ్ల పిల్లలు 5994 మంది ఉన్నారు. ఇందులో ఎక్కువగా అద్దె భవనాలు ఉండడంతో చిన్నారులు గర్భిణులు బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆదేశాలు అమలయ్యేలా చూస్తున్నాం..

ప్రభుత్వ ఆదేశాలు అమలయ్యేలా కృషి చేస్తున్నాం. ఎక్కువగా అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నవి. గత జూన్ నెల నుంచి ప్రభుత్వం అద్దె మొత్తాన్ని పెంచింది. అన్ని విధాలుగా సౌకర్యాలు ఉన్న భవనాల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– భార్గవి, సిడిపిఓ, ఆర్మూర్ ప్రాజెక్టు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలి

- ఉత్తమ ఫలితాలు సాధించాలి
- ధర్పల్లి సీఐ బిక్షపతి

నవతెలంగాణ-సిరికొండ



మాట్లాడుతున్న సీఐ బిక్షపతి

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకొని ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ప్రణాళికబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ధర్పల్లి సీఐ బి.బిక్షపతి అన్నారు. సత్యశోధక్ పాఠశాలలో జరిగిన పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ధర్పల్లి సి.ఐ. బిక్షపతి ముఖ్య అతిథిగా, సిరికొండ ఎస్ఐ జి.రమేష్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సి.ఐ. మాట్లాడుతూ.. పాఠశాల విద్య అనేది మన జీవితంలో కీలకమైనదని, ప్రపంచాన్ని పరిచయం చేసే ఉన్నత చదువులకు ఇది తొలి మెట్టులాంటిదన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ నడవడిక, అలవాట్లు జీవిత పర్యాంతం కొనసాగిస్తే సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతామన్నారు. పాఠశాల నుండి పోటీ ప్రపంచంలో అడుగిడుతున్న తరుణంలో భవిష్యత్తులో ఎదుర్కొనే ప్రవేశ పరీక్షలకు, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, చెడు వ్యసనాలు, సెల్‌ఫోన్ల దుర్వినియోగం లాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. దైనందిన జీవితంలో సైబర్ నేరగాళ్ల ఆగడాలు, మాదక ద్రవ్యాల వినియోగం లాంటివి ఎక్కువవుతున్నాయని వాటన్నింటిని ఆలోచించి సమాజంలో మన ఆచరణ మనుగడ ఉండాలన్నారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఫలితాలు ప్రామాణికమైనవని, విషయ పరిజ్ఞానం అనేది స్పష్టతతో ఉండే అనుకున్న ఫలితాలు సాధించి కన్నవారి కలలను గురువుల ఆశయాలను నేరవేర్చాలన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ పౌష్టికమైన సమతుల్యతో కూడిన ఆహారనియమాలను పాటిస్తూ నిద్రలేమి లేకుండా ఎలాంటి మానసిక ఒత్తిడులకు గురవకుండా ప్రశాంతంగా పబ్లిక్ పరీక్షలను రాయాలని తెలిపారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ మన పరిసరాలలో ఉన్న విలువలు, ఉన్నతస్థాయి మంచి హోదాలు గల వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విభిన్నమైన దారులను ఎంచుకొని వినూత్నరీతిలో గల నూతన అవకాశాలను ఎంచుకునేలా పైచదువులను ఎంచుకోవాలన్నారు.

గౌరవ అతిథులు స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్, డి.టి.యఫ్ జిల్లా అధ్యక్షులు యం.బాలయ్య విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల గురించి చక్కని అవగాహన కలిగేలా ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నాటికలు, సరదా ఆటలు ఆహుతులను పరవశింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, బోధన్ మండలంలో సోమవారం పర్యటించనున్నారని ఆయన వ్యక్తిగత సిబ్బంది మహిపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడపల్లి మండలంలో గృహ జ్యోతి, ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభిస్తారని, బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో, సంగెం గ్రామంలో ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ బిల్లులను అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

విరబూసిన చిక్కుడు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో సంజీవ్ అనే రైతు చిక్కుడు పంట సాగు చేశాడు. అది ప్రస్తుతం ఎంతో విరగ బూసింది. ఈ పంట మార్కెట్లో రూ.80 చొప్పున వ్యాపారులకు విక్రయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు తీగలకు పాదులు ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నామని వివరించారు. ఇతర పంటలతో పాటు చిక్కుడు పంటను పండించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాలీఫ్లవర్, మిరప, వంకాయ, టమాట పంటలు పూర్తవడంతో తిరిగి పంటలను వేయడానికి దుక్కి దున్ని చదును చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా తమ పంటపొలాల్లో కూరగాయల సాగు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రత్యామ్నాయగా గట్లపైన మునగ చెట్లను పెంచుతున్నామని, నేడు మునగకు సైతం భలే గిరాకీ ఉందని ఆ రైతు చెబుతున్నాడు.

విద్యార్థుల అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల 1997-1998 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 25 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని రాంపూర్.డి గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయలతో గ్రామంలోని నర్సింగ్‌పూర్ రహదారి వాటర్ ట్యాంక్ నుంచి లక్ష్మి నారాయణ ఇంటివరకు నిర్మించ తలపెట్టిన సీసీ రహదారికి శంకుస్థాపన చేసినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్.దత్తాద్రి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. రాబోవు రోజుల్లో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రత్యేక చొరవ చూపుతూ ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకు వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాంపూర్ సహకార సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ సక్కర్ల రాజన్న తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కేక్ తినిపిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్ర బిజెపి అధిష్టానం ధర్మపురి అరవింద్‌ను రెండవసారి బిజెపి నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ ధర్మపురి అరవింద్‌ను గతం కంటే ఈసారి అధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నా రు. దేశంలో నరేంద్ర మోడీని, ఇందూర్ పార్లమెంట్‌లో ధర్మపురి అరవింద్‌ను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. పార్లమెంట్లో ఇచ్చిన మాట ప్రకారం రైతుల చిరకాల కోరిక పసుపు బోర్డును సాధించి స్వయాన దేశ ప్రధాని నరేంద్ర మోడీతో ఇందూరు గడ్డపైనే ప్రకటించడం గర్వకారణమని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఏ ఒక్క రూపాయి అవినీతి చేయకుండా పాలన కూడా సాగించారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎవ్వరు చేయలేని అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. పేద ప్రజల, రైతుల, నిరుద్యోగుల, కార్మికుల పక్షాన నిలబడి నిరంతరం పోరాడే నాయకుడు ధర్మపురి అరవింద్ అని అన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రెంజర్ల గంగాధర్, ఐటీ సెల్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కమలాకర్, బీజేవైఎం మండల కార్యదర్శి హరీష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్, నాయకులు గాండ్ల శ్రీనివాస్, ఉట్నూర్ శివకుమార్, పోల్కం నవీన్, బోండ్ల ప్రశాంత్, చింత మణికంఠ, చింత హనుమంతు, మల్యాల నవీన్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

రెండవరోజు ఎన్ఎస్ఎస్ శిబిరం



నవతెలంగాణ-భీంగల్

భీంగల్ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో వాలంటీర్లు జాగీర్యాల్ గ్రామంలోని హనుమాన్ ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిబిరంలో వాలంటీర్లు శ్రమదానం ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. వాలంటీర్లు సామాజిక సేవా దృక్పథంతో శ్రమధానం చేయడం అభినందనీయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.సతీష్ మాట్లాడుతూ.. అదేవిధంగా తెలంగాణ క్రీడా ప్రాంగణ ప్రదేశంలో వెలసిన పిచ్చి మొక్కలను తొలగించారు. భోజన విరామం అనంతరం గ్రామంలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.సుదర్శన్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర మంత్రి సీతక్కను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ కలిశారు. ఆదిలాబాద్ జిల్లాకు వెళుతున్న తరుణంలో మార్గమధ్యంలో బ్రేక్‌ఫాస్టింగ్ చేసే సమయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బ్రాహ్మణపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ తెలన్న తదితరులున్నారు.


మంత్రిని కలిసిన శ్రీనివాస్‌గౌడ్

పోలియో చుక్కలతో చిన్నారులకు సంపూర్ణ రక్షణ

- తల్లితండ్రులు తప్పకుండా వేయించాలి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో

నవతెలంగాణ-విలేకరుల బృందం

పోలియో చుక్కలతో చిన్నారులకు సంపూర్ణ రక్షణ కలుగుతుందని పలువురు అన్నారు. తమ పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజానికి కృషి చేయాలని సూచించారు. పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

కమ్మర్‌పల్లి : పిల్లల ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు చిన్నారులకు స్వయంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పోలియో చుక్కలు వేశారు. చిన్నారులకు బిస్కెట్ పాకిట్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని, ఇది చాలా మంచి కార్యక్రమం అన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు అంగవైకల్యం (పోలియో) రాకుండా పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. పోలియో చుక్కలు వేసేందుకు వైద్య బృందం, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారన్నారు. గ్రామాలలో జనాభా ప్రతిపాదికన ఒకటి నుండి 5 సెంటర్ల వరకు ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నందున 5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ రోజు పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలు ఎవరైనా ఉంటే ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి బీమా జమున, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ రమేష్, వేల్పూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీరడి భాగ్య, సామ మహిపాల్‌రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ ప్రతాప్, మండల, స్థానిక నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం..

పల్స్ పోలియో చుక్కలు వేయించడం ద్వారా చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి సంరక్షిద్దామని కమ్మర్‌పల్లి తహసిల్దార్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని తహసిల్దార్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయవచ్చు అన్నారు. పోలియో చుక్కలు చంటిబిడ్డ రోగనిరోధక శక్తిని పెంచే సంజీవని అని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, మండల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ, ఆయా గ్రామాల్లో ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని : పోలియో మహమ్మారి రాకుండా ఉండాలంటే పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని మోస్రా మండల జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో సెంటర్‌లో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. లక్ష్మపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చందూర్ మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ దశగౌడ్ పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

ఏర్గట్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండల వైద్యాధికారులు విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో ఎంపీటీసీ జక్కని మధు సూధన్ పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 0-5 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలకు తల్లిదండ్రులు ఖచ్చితంగా పోలియో చుక్కలను వేయించాలని, అంగవైకల్యం రాకుండా చూడాలని, పోలియో రహిత గ్రామాలుగా చేసేందుకు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, ఆశావర్కర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : చిన్నారుల భవిష్యత్తుకు సంపూర్ణ రక్షణ ఇచ్చేది పోలియో చుక్కలు మాత్రమేనని, కావున పుట్టిన ప్రతి చిన్నారి నుండి ఐదు సంవత్సరాల వారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని బోధన్ జడ్పిటిసి లక్ష్మి సూచించారు. ఆదివారం బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామంలో ఆమె పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాలలో ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటింటికి వెళ్లి చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. వైద్య సిబ్బంది కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలని విధులలో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రమీల, ఎంపిటిసి వెంకటేష్, అంగన్వాడి కార్యకర్తలు పద్మ, అన్నపూర్ణ, సాయమ్మ, ఆశకార్యకర్త అంజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాలూర మండలంలో..

సాలూర పిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పిహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాలూర పీహెచ్సీ పరిధిలో 8260 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి గుర్తించారు. 55 బూత్‌లను ఏర్పాటు చేసి 220 టీంలతో పాటు ఒక మొబైల్ టీం, ఏడుగురు సూపర్వైజర్లను నియమించారు. 7 హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి, చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల చిన్నారులకు ఆశావర్కర్ సునీత పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సవిత, ఏఎన్ఎం నందకుమారి, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్ : రెండు పల్స్ పోలియో చుక్కలు పిల్లల జీవితాన్ని మారుస్తోందని, మండలంలో ప్రతి జీరో నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ రజనీ కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 4650 మంది చిన్నారులను గుర్తించినట్టు తెలిపారు. 4360 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో 95 శాతం చుక్కలు పూర్తి చేసినట్టు వివరించారు. మిగిలిన వారికి మరో రెండు రోజుల్లో ఇంటింటికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలను తమ వైద్య సిబ్బంది వేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, ప్రమోదిత, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, ఆరోగ్య కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్(మెండోరా) : నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని వైద్య అధికారులు అన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో అధికారులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరూ పోలియో వ్యాధిబారిన పడకుండా ప్రతీ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పల్స్ పోలియోపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. చిన్నారులు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా కూడా వారికి చుక్కల మందు వేయించాలని సూచించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు వేయించి చిన్నారుల నిండు జీవితానికి మార్గం వేయాలని కోరారు. కార్యక్రమాలలో మండల వైద్య అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల పరిధిలో పల్స్‌పోలియో చుక్కలు మొదటి రోజు విజయవంతం అయినట్లు అసుపత్రి వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ తెలిపారు. ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామ సమీపంలోని కేకే తాండాలోని 0-5 సంవత్సరముల పిల్లలకు ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పోలియో చుక్కలు వేశారు. అలాగే నేడు, రేపు ఇంటింటికి తిరిగి పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రత్యేక పోలీసు ఏడో బెటాలియన్‌లో కమాండెంట్ బి.రాంప్రకాష్ ఆధ్వర్యంలో చిన్నారులకు చుక్కలు ముందు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్రెడ్డి, ఆనంద్, అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని బాల్కొండ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ యూనుస్, కుందరపు శీను, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ జావీద్, సయ్యద్ రియాజుద్దీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నపిల్లలందరికీ పల్స్‌పోలియో వేయించే విధంగా చూడాలన్నారు. చిన్నపిల్లలకు పల్స్ పోలియో శ్రీరామ రక్షణ అని అన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్ ఖాన్, సయ్యద్ శోహిద్దీన్, విక్కీ, పురుషోత్తం, అంగన్వాడీ సిబ్బంది వైద్య సిబ్బంది తదితరులున్నారు.

4795 మంది పిల్లలకు పోలియో చుక్కలు..

మాక్లూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 4995 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని టార్గెట్ ఉండగా అందులో ఒక రోజు 4795 మందికి వేశామని తెలిపారు. 39 పోలియో చుక్కల కేంద్రాలు, ఒక మొబైల్ టీం ద్వారా హై రిస్క్ ఏరియా లయన్ ఇటుకబట్టీలు, కాన్సన్ ట్రక్షన్ ఏరియాల్లో సందర్శించి పోలియో చుక్కలు వేశామన్నారు. డబ్లూఎచ్ఓ కన్సల్టెంట్ ప్రదీప్, అబ్జర్వర్ శ్రీకాంత్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే


వర్ని : పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ


రెంజల్ : పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ


బోధన్ : ఎరాజ్‌పల్లిలో పోలియోచుక్కలు వేస్తున్న జడ్పిటిసి లక్ష్మి


బాల్కొండలో..


డిచ్‌పల్లి : పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి


ఏర్గట్లలో..

మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

నవతెలంగాణ-భీంగల్


భీంగల్ పట్టణ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నాల భగత్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కన్నె సురేందర్ కోరారు. ఆదివారం భీంగల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.10 కోట్లు శాంక్షన్ చేశారని తెలిపారు. మంజూరైన వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో విడుదల చేసిన నిధులకు టెండర్ పూర్తి కాలేదని, ప్రస్తుతం టెండర్ పూర్తి కానందున విడుదల చేసిన నిధులకు టెండర్ పూర్తి చేసి పట్టణ అభివృద్ధి కొరకు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. నిధులు విడుదల కావడంతో అప్పటి మంత్రి ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పట్టణంలో పర్యటన చేసి అధికారులతో చేపట్టవలసిన పనులను సైతం గుర్తించారని తెలిపారు. గుర్తించిన పనులు పూర్తి చేసేందుకు విడుదల చేసిన రూ.10 కోట్ల పనులకు టెండర్ పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బొదిరే నర్సయ్య, సతీష్‌గౌడ్, లింగం నాయక్, సీహెచ్ గంగాధర్, నాయకులు మల్లెల ప్రసాద్, మూత లింబాద్రి, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ఉత్తమ అవార్డులు

- సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలను ఎంపిక చేసి అవార్డులను అందిస్తారు. ఇందులో భాగంగా మండలంలోని ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తున్న ఎస్.యమున, తాళ్ళరాంపూర్ వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తున్న గాజుల శ్యామలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, పీఆర్టియూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను ఆదివారం అందజేశారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.


సన్మానం పొందుతున్న ఉపాధ్యాయులు

సరదాగా గడిపేద్దామా..

అందుబాటులోకి అరణ్య అర్బన్ పార్క్.. ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10

ఈ వేసవిలో ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడపాలనుందా..? అయితే నిజామాబాద్ జిల్లా కేంద్రానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసిన 'జిల్లా అరణ్య అర్బన్ పార్క్'కు వెళ్లాల్సిందే. పార్కులో పనులు పూర్తవడంతో రెండు నెలల క్రితం ఈ అర్బన్ పార్క్‌ను సంబంధిత అధికారులు ప్రారంభించారు. అయితే ఎంట్రీ ఫీజు సైతం అందుబాటు ధరల్లోనే ఉంది.


అరణ్య అర్బన్ పార్క్ ముఖచిత్రం

నవతెలంగాణ-మాక్లూర్

నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంత ప్రజలకు వేసవి సెలవుల్లో చిన్నారులతో గడపడానికి 63వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అరణ్య అర్బన్ పార్క్ అందుబాటులోకి వచ్చింది. ఇది మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల సరిహద్దుల్లో గల అటవీశాఖ భూమిలో సుమారు 400 ఎకరాల్లో ఏర్పాటు చేశారు.

ప్రత్యేకతలు ఇవే..

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనే జిల్లా అరణ్య అర్బన్ పార్క్ ఉంది. అటు ఆర్మూర్, ఇటు నిజామాబాద్ రహదారిపై అందుబాటులోనే ఉండటంతో పర్యాటకుల సందడి బాగానే పెరిగే అవకాశం ఉంది. వేసవిలో ప్రజలు పార్కులో ఆనందంగా గడపడానికి వాచ్‌టవర్, గార్డెన్, చిల్డ్రన్‌పార్క్, ఓపెన్ గ్లాస్ రూం, నాలుగు ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. ఇక సఫారీ, సైక్లింగ్ కూడా కొద్ది రోజుల్లోనే ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే పార్కులో నిఘా ఉంచేందుకు సుమారు 20 సీసీ కెమెరాలకు అధికారులు అమర్చారు. అలాగే మౌళిక సదుపాయాలలో భాగంగా తాగునీరు అందుబాటులో ఉంది. మరుగుదొడ్లను సైతం నిర్మించారు.

అందుబాటులోనే ఎంట్రీ ఫీజు..

సువిశాలమైన పార్కును ఏర్పాటు చేసిన సందర్శకులకు ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా ఫొటో షూట్‌కు రూ.1000, నెల పాస్ కోసం రూ.1500. వాకర్స్ నెలపాస్ కోసం రూ.300, అర్థ సంవత్సరం రూ.1200, సంవత్సరం రూ.2000, లైఫ్ టైం పాస్ కోసం రూ.10000 చొప్పున ధరలను నిర్ణయించారు. ధరలతో కూడిన వివరాల బోర్డును కూడా పార్క్ వద్ద ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన ప్రాంతాలైన నిజామాబాద్, ఆర్మూర్‌కు ఈ అరణ్య అర్బన్ పార్క్ దగ్గరగా ఉండటంతో పర్యాటకులు భారీగా వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.


ధరల వివరాలు తెలిపే బోర్డు

కలిసికట్టుగా పనిచేద్దాం

నవతెలంగాణ-కామారెడ్డి

జాతి భవిత కోసమే ఉద్యోగులు తపన పడుతున్నారని డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ అన్నారు. జాతి కోసం, జాతి అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. తెలంగాణ ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆదివారం తన నివాసంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, న్యూ కామారెడ్డి ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు కోశాధికారి గోవర్ధన్ ముదిరాజ్, మురళి ముదిరాజ్, జ్యోతి ముదిరాజ్, రాజయ్య ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, దాస్ ముదిరాజ్,బక్క రాజయ్య ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఆదివారం 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అంబీర్ శ్యాం రావు నరసింహారెడ్డి విఠల్ రావు, మాజీ సర్పంచ్ జంగం భూషణం, ఎంపిటిసి శాంతాబాయి, నారాయణరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృత్యువాత

నవతెలంగాణ-రామారెడ్డి

కుక్కల దాడిలో దూడ మృత్యువాత పడిన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఎర్ర నర్సింలు పశువుల పాకలో ఉన్న గేదె దూడను ఊర కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం కావడంతో పశు వైద్యశాల మూసివేయడంతో, ప్రైవేటు వైద్యులను ఆశ్రయించేలోపే రూ 6000 విలువగల దూడ మృతి చెందిందని బాధితులు తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, ఇలాంటి ఘటనలు జరగకముందే ఊర కుక్కల నివారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.